
ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025





మంత్రి 'ఆనం'ను కలిసిన అధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి శివ శంకర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శివ శంకర్ రావు శనివారం ఆత్మకూరు ఆర్ అండ్ బి అతిథి గహంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డిఐపిఆర్ఓ శివశంకర్ ను అభినందించి, ప్రభు త్వానికి, పాత్రికేయులకు వారధిలా ఉండే సమాచార శాఖలో మెరుగైన సేవలందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నరసరావుపేట నుంచి బదిలీపై నెల్లూరు కార్యాలయంలో విధుల్లో చేరిన డివిజనల్ పిఆర్ఓ రవికుమార్ కూడా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.




ఇది శవాలతో వ్యాపారం..!

శ్మశానంలో ప్రయివేటు దందా - ప్రతి నెలా లక్షల్లో దోపిడీ

మానవత్వం రోజు రోజుకు మంటగలిసిపోతోంది.. తమ వారు చనిపోయి పుట్టెడు దుఖ:ంలో ఉన్నవారిని వదలడం లేదు కొందరు వ్యాపారులు... శ్మశానంకు వెళ్లిన శవాలను డబ్బు కోసం పీక్కుతింటున్నారు... కరోనా సమయం నుంచి ప్రారంభమైన ఈ దందా ఇప్పుడు ఎక్కువైపోయింది.. ప్రభుత్వ స్థలం, కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ ప్రయివేటు వ్యక్తులు కొందరు అధికారపార్టీ నేతల అండ చూసుకొని శవాలతోనూ వ్యాపారం చేస్తున్న సంఘటన నెల్లూరు బోడిగాడితోటలో సాగుతోంది...శవాన్ని పూడ్చిపెట్టడానికి ఒక రేటు... మంచి స్థలం చూపిస్తే మరో రేటు... అడిగేవారు లేకపోవడంతో ఆడిందే ఆట...పాడిందే పాటగా సాగుతోంది..నిన్నటి వరకు వైసిపిలో ఉండి, ఇప్పుడు టిడిపిలో చేరిన ఓ నాయకుడు కనుసైగల్లో అంతా సాగిపోతోంది. నిరుపేదలను సైతం వదలడం లేదు. అమాయకులైతే మరింత ఎక్కువ వసూలు చేస్తున్నారు. అధికారులు దృష్టి పెట్టి శవాలతో వ్యాపారం చేస్తున్న వక్తులను కట్టడి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మానవత్వపు విలువులు దిగజారి పోతున్నాయి.. నెల్లూరు నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం 10 లక్షల వరకు జనాభా ఉంటుంది. పెన్నా తీరంలోని బోడిగాడితోట వద్ద ఎన్నో ఏళ్ల నుంచి హిందువులకు శ్మశానవాటిక ఉంది. ఇక్కడే దహనసంస్కారాలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో నిరుపేదలు నివాసాలుండేవి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు.. వారికి మరోచోట నివాసాలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆర్థికంగా బలంగా ఉన్న వ్యక్తులున్నా ఒకప్పుడు ఈ ప్రాంతానికి వెళ్లాలంటే ముక్కున వేలుసు కోవాల్సింది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టితోపాటు, ప్రయివేటు సంస్థలు ఇక్కడ శ్మశానవాటికలు నిర్మించాయి. నగరంలోని ప్రముఖ వ్యక్తులు దహనం చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంచిగా నిర్వహణ చేస్తున్నారు. మంచినీరు, శవాన్ని కాల్చడానికి కట్టెలు. కూర్చోడానికి స్థలం. అనువుగా ఉంది. మరో పక్కన శవాలను గొయ్యి తీసి పూడ్చడానికి స్థలం ఉంది. ఇది మొత్తం ప్రభుత్వ స్థలం. కార్పొరేషన్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. దహనసంస్కారాలు జరిగే ప్రాంత నిర్వాహకులు ఇటీవల వరకు ఒక శవానికి రూ.1500 తీసుకుంటుండగా, పెరిగిన ఖర్చులతో దానిని రూ.3000 లకు పెంచినట్లు తెలిసింది. ఇందులో ఎలాంటి ఇబ్బందీ లేదు. దాని పక్కనే ఉన్న మరో శ్మశాన వాటికతోనే జనానికి ఇబ్బందులు వచ్చిపడుతున్నాయి. గతంలో నగరంలో ఎవరు చనిపోయినా ఇక్కడ గుంట తీసే వ్యక్తులకు చెబితే అందుకు అవసరమైన రూ.500 నుంచి రూ.750 చెల్లించేవారు. దీనిని పెద్దగా ఎవరూ భారంగా బావించేవారు కాదు. కరోనా సమయంలో కొందరు వ్యక్తులు దీనిని వ్యాపారం చేసినట్లు తెలుస్తోంది...ప్రతి రోజూ నగర పరిధిలో సుమారు 8 నుంచి 10 మృతదేహాలు ఈ ప్రాంతానికి వస్తున్నాయి. కైలాస భూమికి ప్రతి రోజూ కనీసం 3 నుంచి 5 వరకు మృతదేహాలు వస్తున్నాయి. సరాసరి ఐదు చొప్పున నెలకి రూ.1.50 లక్షలు నగదు వసూళ్లు చేస్తున్నారు. ఇందులో గుంట తీసే వ్యక్తులకు 30-40 వేలు చెల్లించినా మిగిలిన మొత్తం ఇక్కడ వ్యాపారం చేస్తున్న వ్యక్తుల జేబులోకి వెళుతున్నాయి.



కైలాస భూమి
శ్మశాన వాటిక, బోడిగాడితోట, నెల్లూరు. Cell: 8096614080

రశీదు నెం. 2083		తేది: 18/06/25
మరణించిన వారి పేరు	P. Murali	
తండ్రి / భర్త	P. Muniswamy	
వయస్సు	39y/M	
చిరునామా	A.C. nagar, nellore	
మొబైల్ నెం.	9963665373	
మరణించిన కారణము	Heart attack	


నెం.	వివరములు	రూ.	పై.
1.	పూడ్చుటకు ఖర్చులు	1500	
2.	కాల్చుటకు ఖర్చులు		
3.	ఇతర ఖర్చులు		

(అక్షరములా పదిహేను వందల రూపాయలు ముట్టినది)

రూ 1500 నగదు వసూళ్లు చేస్తున్న రశీదు

శవాలతో వ్యాపారం...!

బోడిగాడితోటలోని శవాలను పూడ్చిపెట్టే స్థలంలో కొందరు ప్రవేటు వ్యక్తులు దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇక్కడ ఉన్న డంపిండ్‌యార్డ్‌ను...నివాసముండే పేద ప్రజలను మరొక చోటుకు తరలించారు. కార్పొరేషన్ అధికారులు ఈ ప్రాంతాన్ని చక్కగా మార్పు చేశారు. ఇక్కడ ఉండే కొందరు ప్రయివేటు వ్యక్తులు దీనిని వ్యాపారంగా మార్చినట్లు తెలుస్తోంది. గతంలో శ్మశానంలో ఉండే వ్యక్తులు, గుంట తీసేవారికి చనిపోయిన వారి బంధువులు కొంత నగదు ఇచ్చేవారు. అక్కడ కనీస వసతులు లేకపోయినా సర్దుకొని వచ్చేవారు. ఇటీవల కైలాసభూమి పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నారు.తమ వారు చనిపోయి పుట్టెడు దు:ఖంలో వస్తున్నవారిని కొందరు వ్యక్తులు మరింత బాధపెడుతున్నారు.. ఇక్కడ శవాన్ని పూడ్చడానికి రూ.1500 వసూళ్లు చేస్తున్నారు. ఇందులో రూ.700 గుంట తీసిన వ్యక్తికి ఇచ్చి మిగిలింది ప్రవేటు వ్యక్తులు జేబుల్లో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. శవం పూడ్చడానికి మంచి స్థలం కావాలంటే అందుకు మరో రేటు ఇవ్వాల్సి ఉంటుంది. నిన్నటి వరకు వైసిపి ఉన్న ఓ నాయకుడు ఇప్పుడు టిడిపిలో చేరి ఈ దందా నడుపుతున్నారనే విమర్శల న్నాయి,.. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ శ్మశాన వాటిక నడిపి నగదు వసూలు చేసినా అది ప్రభుత్వానికి, ఖర్చులకు ఉపయోగపడుతుంది. అలా కాకుండా కొందరు ప్రవేటు వ్యక్తులు ఇలా శవాలతో వ్యాపారం చేయడం పట్ల నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతా ది కారులు జోక్యం చేసుకొని బోడిగాడితోటలో సాగుతోన్న శవాలతో వ్యాపారాన్ని అరికట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పెన్నా తీరంలోని కైలాసభూమి శ్మశానవాటిక

పాఠ్యపుస్తకాల పేరుతో వ్యాపారం సరికాదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణంలో పాఠ్యపుస్తకాలు పేరుతో పెద్ద ఎత్తున వ్యాపారం చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ పేర్కొంది. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూరల్ ప్రాంతంలోని నారాయణరెడ్డి పేట వద్ద ఉన్న శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద పాఠ్యపుస్తకాలు మరియు అధిక ఫీజులు వసూళ్లను ఖండిస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల వద్ద పాఠ్య పుస్తకాలు అక్రమంగా పాఠశాలలో పెద్ద ఎత్తున అమ్మటంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపించాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసినా ఫలితం శూన్యమన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పాఠశాల ప్రాంగణంలో అధిక ఫీజులు పెట్టి పాఠ్యపుస్తకాలు , విద్యార్థులకి పాఠశాలకి అవసరమైనటువంటి నిత్యవసరాలను పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తుందన్నారు. పాఠశాలల్లో కనీసం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విఫలమయ్యాయన్నారు. స్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విక్రమ్, దేవేంద్ర జిల్లా నాయకులు ప్రవీణ్, శివ, సంతోష్, యశ్వంత్, బాబి , వంశి, విజయ్,కౌశిక్,భారత, యూషిక్, మైఖేల్, పవన్ తేజ, సతీష్, తరుణ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

మంచినీటిని పునరుద్ధరించండి

అధికారులకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని నవాబు పేట వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్ లైన్ మరమ్మతుల సందర్భంగా మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, దీనిని వెంటనే పునరుద్ధించాలని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాల క్రితం నిలిచి ఈ పనులు ఇప్పుడు చేస్తున్నారని, ఆలస్యంగా చేస్తుండడంతో స్థానికులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. మంచినీటి సరఫరా నిలిచిపోయి ఐదు రోజులు గడుస్తుందని, నవాబుపేట, కసుమ హరిజనవాడ, బంగ్లాతోట, మైపాడు గేటు, నజీర్‌తోట, ముకుందాపురం, రామచంద్రాపురం, ఎఫ్‌సిఐ కాలనీ, పుల్లమ్మ సత్రం, యనమల పాళెం ప్రాంతానికి నీటి సరఫర లేదని వెంటనే అధికారులు స్పందించి పునరుద్ధరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

ప్రజాశక్తి-నెల్లూరు :కలెక్టర్ కార్యాలయం, తిక్కన ప్రాంగణంలోసోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100కు ఫోన్ చేయవచ్చన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి-నెల్లూరు : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ,ప్రతినెల మూడవ శనివారం ,జరుపుకుంటున్న సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయభాస్కర్ ఏవో విజయకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారుకలెక్టరేట్ సిబ్బందితో కలెక్టరేట్ ఆవరణం మొత్తం శుభ్రం చేయించి పరిసరాలు మొత్తం ,శుభ్రపరిచారు అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

23న యువత పోరు : వైసిపి

ప్రజాక్తి నెల్లూరు అర్బన్

ఈనెల 23న నెల్లూరులో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మరియు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తెలిపారు. కూటమి ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు 3,000 రూపాయలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు.

ఆ భూమి నాదే..2007లో కొన్నాను..

కోర్టులో తేల్చుకుంటా - మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కనుపర్తిపాడు పరిధిలో సర్వే నెంబర్ 295లో భూమి తనదేనని, 2007లో కొనుగోలు చేశానని, ఒక వేళ అహోబిళం మఠం వారిదేనని వాళ్ల దగ్గర ఎటువంటి ఖచ్చితమైన రెవెన్యూ రికార్డ్స్ తో కూడిన రుజువు చేసినా భూమి ఇస్తానని మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మఠం పెద్దల . దగ్గర రుజువులుంటే కలెక్టర్ దగ్గరికి వెళ్లవచ్చునని, సివిల్ న్యాయస్థానాలకు వెళ్లొచ్చునన్నారు. ఎవరైనా పెద్ద మనుషుల వద్దకు వెళ్లవచ్చు ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ కేవలం ఆశ్రమంలో ఎక్కడో రాసి ఉందన్న అంశాన్ని పట్టుకొని తన వద్దకు వచ్చి డబ్బులు అడగడం న్యాయం కాదు అన్నారు. సర్వే నెంబరు 295లో 1954లో పొన్నవోలు దశరథరామి రెడ్డి, పొన్నవోలు వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఈ పొలాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, అందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు కూడా తన వద్ద ఉన్నాయని తెలిపారు. పొన్నవోలు దశరథరామిరెడ్డికి 0.91 సెంట్లు, పొన్నవోలు వేణుగోపాల్ రెడ్డికి 0.91 సెంట్లు భూమిని కొనుగోలు చేశారన్నారు. పొన్నవోలు దశరథరామిరెడ్డి తన కుమార్తె అయిన సురా మంజులమ్మకు 0.91 సెంట్లు ఇచ్చారని, వేణుగోపాల్ రెడ్డికి వచ్చిన 0.91 సెంట్లు పొలంను 40 ఏళ్ల కిందట కనపర్తిపాడు నివాసి అయిన రామయ్యకు విక్రయించారన్నారు. ఆ పొలంను రామయ్య 2002లో మురళీకృష్ణమరాజు, కిలారి రమేష్ బాబుకు విక్రయంచేశారని వివరించారు. 2007లో మురళీకృష్ణమరాజు, కిలారి రమేష్ బాబు తదితరులు తనకు ఈ భూమిని విక్రయించారని అందుకు సంబంధించిన రెవెన్యూ డాక్యుమెంట్స్ ను మీడియాకు చూపించారు. 2007లో ఇక్కడ 40 ఎకరాలు కొనుగోలు చేశానని, అందులో రెండు ఎకరాల పొలం ఉందన్నారు. వాస్తవాలు పక్కన పెట్టి తన ప్రతిష్ట దెబ్బతీస్తున్నారన్నారు. అధికారుల వద్ద న్యాయం జరగదని, అందుకే కోర్టులో ప్రయివేటు కేసు నమోదు చేసి అక్కడే తేల్చుకుంటానన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సిహెచ్ హరిబాబు యాదవ్, ఏసునాయుడు, మల్లు సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆదాల

ఆ స్థలం అహోబిళం మఠందే..

మఠం కార్యదర్శి కెసి వరదరాజన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ పరిధి పరిధిలోని కనుపర్తిపాడు గ్రామం 295 సర్వే నెంబర్ 1.80 ఎకరాల స్థలానికి సంబంధించి తమకు 1869 నుంచి హక్కులు ఉన్నాయని అహోబిళం మఠం కార్యదర్శి కేసి వరదరాజన్ తెలిపారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనికి సంబంధించి తాము ప్రతేడాది కిస్తీలు కూడా చెల్లించామన్నారు. 2007 సంవత్సరంలో ఈ పొలం అన్యాక్రాంతమైందని తర్వాత ఆదాల కుటుంబ సభ్యుల చేతికి వెళ్లిందన్నారు. ఈ భూమి అహోబిళం పీఠం సంబంధించి నరసింహా స్వామిని దీనిపై మాజీ పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి చుట్టూ అనేకసార్లు తిరిగిన న్యాయం చేయలేదన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారించి తమకు అన్ని హక్కులు ఉన్నాయని తేల్చారన్నారు. నరసింహస్వామి భూమి ఆయనకే దక్కాలన్నారు.



మాట్లాడుతున్న మఠం కార్యదర్శి కెసి వరదరాజన్

1906 ఆర్ఎస్ఆర్ ప్రకారం ఆ స్థలం మఠందే

నెల్లూరు రూరల్ తహశీల్దారు

అహోభిళం మఠం భూమిగా వివాదం నడుస్తోన్న 1.80 ఎకరాలు భూమికి సంబందించి నెల్లూరు రూరల్ తహశీల్దారు కృష్ణప్రసాద్ ను వివరణ కోరగా 1906-1910 సంవత్సరంలో ఆర్ఎస్ఆర్ ల్యాండ్ ప్రకారం అహోభిళం మఠంకు చెందినదిగా రికార్డులో ఉందని, దానిని పరిశీలించి మాత్రమే చెప్పామన్నారు. అటు తరువాత ల్యాండ్ రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. 1954 నుంచి రికార్డు చూపుతున్నారని, దేవాదాయశాఖ నుంచి ఆ భూమి మరొకరికి ఎలా వచ్చిందో చూడాల్సి ఉందన్నారు. దీనిని పరిశీలిస్తామని, తెలిపారు. ఆ భూమి మార్పులు, చేర్పులు గురించి చూడాల్సిఉందని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

రెండు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు : ఒడిశ్శా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్న నిందితుడు ప్రశాంత కుమార్ భోల్ ను సంతపేట పోలీసులు అరెస్టు చేశారని నగర డిఎస్‌పి పి.సింధుప్రియ పేర్కొన్నారు. శనివారం సంతపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశ్శా రాష్ట్రానికి చెందిన ప్రశాంతి కుమార్ భోల్ చెడు వ్యసనాలకు బానిసై నగదు కోసం అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో సంతపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇతని వద్ద రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. సంతపేట పోలీసు స్టేషన్ సిఐ జి.దశరథరామారావు, ఎస్ఐ జి.శ్రీహరి, హెడ్‌కానిస్టేబుల్స్ వి.లావణ్యకుమార్, విజయ్‌మోహన్, సుబ్బారావు, పోలీసు కానిస్టేబుల్స్ ఎస్.సురేంద్రబాబు, కెవి సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షిం చుకోవాలని ఎంపిడిఒ నరేంద్రదేవ్ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ నరేంద్రదేవ్, చెర్లో పాలెం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సునీత మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్య కర్తలు, సచివాలయ సిబ్బంది, పీల్ అసిస్టెంట్లు ఉన్నారు.

యోగా డే వేడుకలు

నెల్లూరు : సుమారుగా పదివేల మంది ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.యోగ వల్ల హెల్త్ వెల్త్ హ్యాపీ నెస్ ఏర్పడు తుందన్నారు. ఇంకా ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ఎస్‌పి జి. కష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, డి ఆర్ ఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు. ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి యోగ సాధన తోడ్పడుతుందని ఎస్‌పి జి.కృష్ణకాంత్ పిలుపు నిచ్చారు. శనివారం పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సామూహిక యోగాసనాలు నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యం : వాణీశ్రీ


యోగాతో ఆరోగ్యం, ఆయుషే కాదు జీవన విధానం పెరుగుతుందని ప్రముఖ సీనియర్ హీరోయిన్ కళాభినేత్రి వాణిశ్రీ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, (ది పి ఎం పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా), శేష ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం, బుజబుజనెల్లూరు లోని శేషు స్కూల్ ఆవరణంలో11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు.

విద్యుత్ భవన్‌లో..

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. విజయన్ పాల్గొన్నారు

కందుకూరు : కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టి వి యన్ లక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమం కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్ టి ఓ టి వి యన్ లక్ష్మి మాట్లాడారు. హరిణి హాస్పిటల్ డాక్టర్ టి మల్లికార్జున, విజ్ఞాన్ విహార్ స్కూల్ , ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థులు , రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లూరు : అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు సిఐ మంగారావు ఇతర అధికారుల ఆధ్వర్యంలో 700 మందితో యోగా దేవేడుకలు నిర్వహించారు. డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజల్వన చేసి యోగా డే వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వలేటివారిపాలెం : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పాటశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మాలకొండ పుణ్యక్షేత్రంలో శనివారం యోగాంధ్ర వేడుకలు జరిగాయి.

నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం ఉదయం యోగా డే వేడుకలు జరిగాయి. నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగసముద్రం :మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, అన్ని సచివాలయాల్లోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ కట్టా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన యోగ కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామస్తులుపాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు : జిల్లా ఉపరవాణా కమిషనరు బి చందర్ ఆదేశా మేరకు కందుకూరు పరిధిలో నాన్ - ట్రాన్స్‌పోర్టు బృందాన్ని ఏర్పాటు చేశారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శనివారం 2 కార్ లకు కేసులు రాసి సీజ్ చేసి జరిమానా విధించారు. తనిఖీలలో గోపి నాయక్, కరుణాకర్ పాల్గొన్నారని కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టి వి యన్ లక్ష్మి తెలిపారు.



రామయ్య అంతిమ యాత్రలో పాల్గొన్న కందుకూరు,చీరాల ఎంఎల్ఎలు

ముగిసిన కంచర్ల రామయ్య అంత్యక్రియలు

హాజరైన పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత ,శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్ తండ్రి రామయ్య అంత్యక్రియలు శనివారం సాయంత్రం జరిగాయి. గత రెండు రోజులుగా రామయ్య పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉంచిన విషయం తెలిసిందే. గడిచిన రెండు రోజుల్లో అనేకమంది శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి శ్రేణులు ఇక్కడ పార్టీ నాయకులు సందర్శించి నివాళు లర్పించారు. శనివారం రామయ్య అంతిమయాత్ర ప్రకాశం కాలేజీ ఆవరణ నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావుతోపాటు చీరాల శాసనసభ్యులు మద్దూరి మాలకొండయ్య సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంయల్ఎలు డాక్టర్ దివి శివరాం, బొల్లినేని రామారావు, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య , జబర్దస్థ్ ఫేమ్ హెపర్ ఆది తదితరులు పాల్గొన్నారు. బాణా సంచా మూతలతో రామయ్య పార్థివదేహాన్ని ఊరేగిస్తు కాలేజీ అవరణంలో దహనంచేసేప్రాంతానికి తరలించారు.రామయ్య పెద్ద కుమారుడ్డు కంచర్ల విజయ శ్రీనివాస్ రామయ్య చితికి కొరివి పెట్టారు.



ఎంఎల్ఎ 'కాకర్ల' ఏడాది పాలనపై ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-దుత్తలూరు

ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తన ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన ప్రత్యేక సంచికను శనివారం ఉదయం స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన యోగాంధ్ర డేలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతో ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి అంకితంగా పనిచేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తీసుకున్న పలు చర్యలను, నూతన ప్రాజెక్టులను ఈ ప్రత్యేక సంచికలో విశ్లేషించినందుకు ప్రజాశక్తి పత్రికకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేలపూడి వెంకటరత్నం, మాజీ మండల అధ్యక్షులు ఉండేలా గురవారెడ్డి, నర్రవాడ మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్య నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రజాశక్తి రిపోర్టర్ టీ.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతం



ప్రజాశక్తి-ఉదయగిరి : హోప్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం డాక్టర్ సిహెచ్ వినయ్ వినోద్‌బాబు చేసిన ప్రతిభ డెంటల్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంపై కుటుంబ సభ్యులు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో దంత పేషంట్ల వర ప్రసాదినిగా హోప్ డెంటల్ వైద్యులు నిలిచారని, ఆదాయాన్ని మరిచి ప్రజల ఆరోగ్యాన్ని కోరుతూ వైద్యం అందిస్తున్న హెూప్ డెంటల్ వైద్యం అందించడం ఈ ప్రాంత ప్రజలు వారిని అభినందిస్తున్నారు. ఇటీవల నెల్లూరు జిల్లాలోని అందని వైద్యాన్ని మెట్ట ప్రాంతమైన ఉదయగిరి పాత పంచాయతీ బస్టాండ్‌లో ఉన్న హోప్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, డాక్టర్ సిహెచ్ వినయ్ వినోద్ బాబు ఇంప్లాంట్ సర్జరీ విజయవంతం చేసి జిల్లాకు ఆదర్శంగా నిలిచారు. కొండా సుబ్బారెడ్డి 65 సంవత్సరాల వయసులో దంత సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడడంతో హెూప్ వైద్యశాలను సంప్రదించారాని అత్యాధునిక దంత చికిత్స నిర్వహించి నెల్లూరు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఫలితం లేని మెట్టప్రాంతంలో అధునాత్మకమైన పరికరాలతో ఆపరేషన్ విజయవంతం చేయడంపై కుటుంబ సభ్యులు హోప్ డెంటల్ వైద్యులను అభినందించారు. వైద్యశాలలో అన్ని రకాల దంత చికిత్సలు నిర్వహిస్తామని నాణ్యమైన దంత వైద్యాన్ని ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకే హోప్ డెంటల్ హాస్పిటల్ ఈ ప్రాంతంలో నిర్మించామని వైద్యులు చెప్పడం సులువైన పద్ధతిలో ఈ ప్రాంతం తగినట్లుగా తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం ప్రజలను ఆశ్చర్యాన్ని గురిచేస్తూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైన ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు హోప్ మల్టీస్పెషలిటీ హాస్పిటల్ పి.ఆర్.ఒ ఆర్.వెంకట్ సిబ్బంది ఎస్.రమేష్, జి.శిరీష అందుబాటులో ఉంటారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

జెబి కళాశాలలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రతినెలా మూడవ శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర (థీమ్: నీరు - మీరు) కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10.30 గంటలకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు కళాశాల ఆవరణలో సమావేశమై స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, బోటని విభాగాధిపతి వి.వసుంధర దేవి మాట్లాడారు. కార్యక్రమంలో స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పి.నాగేశ్వర రావు, ఆయుబ్ అహ్మద్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి



ప్రజాశక్తి-కావలి : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో మున్సిపల్, విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సంబంధిత సమస్యలు, వీధి దీపాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు కల్పించాలని, అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పని చేయాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని, విద్యుత్‌లు పట్టణానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఎలక్ట్రికల్ డిఇ వెన్నెల, ఎడిఇ రవికుమార్, మున్సిపల్ డిఇ రామ రావు, అధికారులు పాల్గొన్నారు.

జాఫర్ మొహిద్దీన్‌కు సన్మానం



ప్రజాశక్తి - ఉదయగిరి : మండలంలోని దాసరపల్లి హైస్కూల్ వర్చుయలు ప్రధాన పాత్ర పోషించిన జాఫర్ మొహిద్దీన్ ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శనివారం దాసరపల్లి నూతన హై స్కూల్‌లో బదిలీ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు జాఫర్ మొహిద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. ఇటీవల వారు బదిలీల్లో కారణంగా హజరత్ ఉపాధ్యాయులు దుత్తలూరు పాఠశాలకు బదిలీ కాగా వింజమూరు పాఠశాలకు షేక్ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ బదిలీలు కారణంగా వారికి ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి సేవకుడు కావ్య కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజక వర్గాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తూ నిరంతరం కావలి సేవకుడిగా 'సేవ చేస్తూ', "కావ్య అను నేను" అని ప్రమాణం చేసి, ఏడాది పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శనివారం పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ ఆధ్వర్యంలో దివ్యాంగుల తో కలిసి కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందడ వెంకట్రావు, 16వ టిడిపి నాయకులు శివ, బిట్రగుంట వెంకటరావు, అలహర్, అవులవారు శ్రీనివాసులు, షేపురం బాషా, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

'ఓలేటి' కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-కావలి : కావలి సీనియర్ పాత్రికేయులు, ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల అకాల మరణం చెందడంతో మాజీ మంత్రి, సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శనివారం పట్టణంలోని ఆయన నివాసానికి విచ్చేసి, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఆయన మృతిపై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ పాత్రికేయుడుగా ఓలేటి నాగేశ్వరరావు సమాజానికి, పాత్రికేయ రంగానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. నాగేశ్వరరావు అకాల మృతి జర్నలిజానికి తీరని లోటు అని, ఆయన క్రమశిక్షణ కలిగిన పాత్రికేయుడిగా జర్నలిజంలో రాణించారని తెలిపారు. నాగేశ్వరరావు మృతి వ్యక్తిగతంగా తమకు కూడా తీరని లోటు, అని 1997 నుండి ఆయన తమకు చిరకాల మిత్రుడిగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయనతోపాటు టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు పొట్లూరు శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు షేక్.మస్తాన్, సీనియర్ నాయకులు అమరా వేదగిరి సుబ్బారావు గుప్తా, పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణ మహోత్సవం



ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు మండలం తెడ్డుపాడు గ్రామ దేవతలైన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి గ్రామ ప్రజలు దూర ప్రాంతాల వారు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కల్యాణం సందర్భంగా నాలుగు రోజుల పాటు గ్రామంలో నిత్య అన్నదాన నిర్వహించడం విశేషం. గ్రామంలో సాంప్రదాయ కార్యక్రమాలకు ప్రజలు ఎంతో ఆదరణ చూపుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని దేవదేవతా ఉత్సవాలు ఘనంగా జరుపుకునేలా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ పుణ్యకార్యంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఉదయం అనుసముద్రంపేటకు వెళ్లే రోడ్డు దర్గా ఆర్చి వద్ద యాక్సిడెంట్ జోన్ ప్రాంతాన్ని నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం ఆత్మకూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ జూన్‌లో కృష్ణపట్నం - హుబ్లీ జాతీయ రహదారి 67 నుంచి ఎఎస్‌పేట దర్గాకు వెళ్లే ఆర్చి రోడ్డు వద్ద ఒకే ప్రాంతంలో ఒకే తరహాగా మూడు ప్రమాదాలు జరగడం దురదృష్టకరంగా మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన అన్ని ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించినట్లు మంత్రి ఆనం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇటీవల తాను రాసిన లేఖపై నేషనల్ హైవే అథారిటీ అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. అవసరమైతే ఆర్ అండ్ బి మంత్రి, స్టేట్ హైవే ఉన్నతాధికారులతో మాట్లాడి నేషనల్ హైవే అథారిటీతో



ఎఎస్‌పేట ఆర్చ్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. దర్గా రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్, జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా అందించినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ప్రమాదాల తీవ్రత, సంఖ్య తగ్గిందన్న మంత్రి. ఈ సంఖ్యను ఇంకా తగ్గించి ఒక్క ప్రమాదం కూడా జరగకుండా ఉండడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దేవాదాయ శాఖ గురించి మాట్లాడుతూ తిరుమలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు దేవాదాయ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే అన్ని ఆలయాలకు పాలకవర్గాలను నియమిస్తున్నామని, ప్రతి పాలకవర్గంలో ఒక బ్రాహ్మణుడు, ఒక నాయీ బ్రాహ్మణుడికి స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఐదు కోట్లు ఆదాయం దాటిన ప్రధాన ఆలయాల్లో శుచి రుచి గల అన్న ప్రసాదాన్ని భక్తులకు నాణ్యత ప్రమాణాలతో అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ కింద రూ.25 లక్షలు నుంచి రూ.కోటి వరకు ఆలయాల మరమ్మతులు, పునర్నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. నూతనంగా 481 ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద రూ.10,000 మంజూరు చేశామని, అర్చకులకు రూ.10,000 నుంచి రూ.15 వేలకు గౌరవ వేతనాన్ని పెంచామన్నారు. వేద విద్య అభ్యసించి సర్టిఫికెట్ కలిగిన 600మంది వేద విద్యార్థులకు ప్రతినెలా రూ.3000 చొప్పున మూడు సంవత్సరాల పాటు అందిస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖలో ఇచ్చిన ప్రతి హామీని నూటికి నూరు శాతం అమలు చేస్తూ దేవాలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్, నేషనల్ హైవే డిప్యూటీ మేనేజర్ సుదాన్స్ కుమార్, ఆర్‌డిఒ పావని, కమిషనర్ గంగా ప్రసాద్, డిఎస్‌పి వేణుగోపాల్, తహశీల్దార్ పద్మజ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిఫారం పట్టాలకు రిజిస్ట్రేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

ప్రజలకు అందించే డిఫారం పట్టాలకు రిజిస్ట్రేషన్లను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.మున్నా కోరారు. స్థానిక సంతపేట సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బాలాజీ నగర్, తదితర ప్రాంతాలలో డిఫామ్ పట్టాలకు రిజిస్ట్రేషన్లు ప్రభుత్వం నిలుపుదల చేసిందని విమర్శించారు. దాంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల నివసించే డిఫామ్ పట్టాల నివాసాలకు, ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ లను చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి పేద ప్రజలు నివాసాలు ఉండేందుకు, పట్టాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఆ పట్టాల హక్కుదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేలా నిరుద్యోగ భృతిని నిరుద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా డిఫామ్ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో ఈనెల 23న నెల్లూరు విచ్చేస్తున్న సిఎం కార్యక్రమాన్ని ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో షేక్.సర్దార్, వాసుదేవ రెడ్డి, అహ్మద్, మీరా, కరీముల్లా, షానవాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

23న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి -ఉలవపాడు



అంగన్‌వాడీ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఎస్.ఆర్.ఎఫ్ యాప్ ను రద్దు చేయాలని, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని, మినీ వర్కర్లను, మెయిన్ వర్కర్లుగా జీఓ విడుదల చేయాలని కోరుతూ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో, రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నా మని, ఈ ధర్నాకు అవకాశం ఇవ్వాలని, ఉలవపాడు సి.డి.పి.ఒ మాధవి లత కు, శనివారం వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, సిహెచ్. ఇందిరావతి మాట్లాడుతూ, ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు, నెలకి రూ.25వేలు ఆదాయం వచ్చే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారన్నారు. తల్లికి వందనం అంగన్వాడీలకు వేయకుండా మొండి చేయి చూపించారని ఎద్దేవ చేశారు. అంగన్వాడీలకు పనిచేసే వారందరూ పేద కుటుంబాలకు చెందిన వారు. వారికి సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. జిల్లా నాయకులు జి.వి కుమార్ గుడ్లూరు మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

త్వరగా ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలులో ఆకాశవంతన నిర్మాణానికి రైల్వే శాఖ గతి శక్తి అప్పగించినట్లు రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనలకే ఒక దశాబ్ద కాలం గడిచిపోయిందని ఇప్పటికైనా రైల్వే అధికారులు ఎల్‌సి నెంబర్ 143లో రోడ్డు అండర్ బ్రిడ్జిని ఎల్‌సి నెంబర్ 144 వద్ద రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్లైఓవర్ ఏర్పాటయితే బోగోలు, విశ్వనాథరావుపేట ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఫ్లై ఓవర్ లేని కారణంగా అత్యవసర అంబులెన్స్‌కు 108 సేవలకు ఇబ్బంది ఉందని రైల్వే గేట్ వేసిన కారణంగా అంబులెన్స్‌తో ప్రాణాలు పోయిన సంఘటన కూడా ఉన్నాయని, దానిపై రైల్వే ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు. భూగోలులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలు, పడమర ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు బోగోలు ఫ్లై ఓవర్‌పై దృష్టి పెట్టి ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిట్రగుంట గ్రామ ప్రజలు కోరుతున్నారని తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు మొక్కలను నాటాలని నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ కోరారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని 19 వ వార్డు వవ్వేరు గ్రామంలో ప్రతి నెలా 3వ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కాటంరెడ్డి లలితా రెడ్డి, పుట్టా లక్ష్మీకాంతమ్మ, జొన్నలగడ్డ శివప్రసాద్ నాయుడు,శ్రీకాంత్ రెడ్డి, మెప్మా సిబ్బంది, సిబ్బంది, పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డిపిఆర్ఒ శివశంకర్



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ రావు శనివారం ఆత్మకూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి రామనారాయణ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డిపిఆర్ఒ శివశంకర్‌ను అభినందించి, ప్రభుత్వానికి, పాత్రికేయులకు వారధిలా ఉండే సమాచార శాఖలో మెరుగైన సేవలందించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అలాగే నరసరావుపేట నుంచి బదిలీపై నెల్లూరు కార్యాలయంలో విధుల్లో చేరిన డివిజన్ పిఆర్ఒ రవికుమార్ కూడా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.



మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

ఉపాధి లేని గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళ పుల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ పనులు కుటుంబానికి 200రోజులు పనులు కల్పించి రోజు కూలీ రూ.700 ఇవ్వాలన్నారు. మండలంలో ఉపాధిహామీ అధికారులు ఒక రోజు ఓగ్రామంలో ఉపాధి పనులు చేపట్టి మరో గ్రామంలో కూలీలకు పనులు కల్పించలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపించారన్నారు. శ్రామిక సర్వే కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల ప్రజలను విచారించగా గ్రామంలో ఉపాధి హామీ పనులు పెట్టలేదన్నారు. అడిగిన వెంటనే పని కల్పించా లని చట్టంలో ఉన్నా కొంతమందికే ఉపాధి హామీ పనులు కల్పించి చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మండల వ్యాప్తంగా జాబ్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం నిర్ధేశించిన పని దినాలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అన్వర్‌బాషా, గ్రామ కమిటీ కార్యదర్శి జక్కరయ్య పాల్గొన్నారు.

పలుచోట్ల శ్రామిక సర్వే



నెల్లూరు రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మన్నవరపాడు గ్రామంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు గ్రామంలోని 200 గ్రామీణ శ్రామికుల కుటుంబాలను కలిసి వారి వివరాలను సేకరించారు. గ్రామంలోని అనేకమంది వ్యవసాయ కార్మికులు పేద రైతులు ఉపాధి హామీ పనులను తక్కువ రోజులు పెడుతుండడంతో వివిధ రకాలైన బేకరీ, స్వీట్ షాపులు హెూటల్లో కార్మికులుగా బేల్దారి పెయింట్ పనులు చేసేవారుగా ఆటోలు నడుపు నడుపుకోవడం ట్రాక్టర్ మెకానిక్ పని చిన్నచిన్న పరిశ్రమలలో రోజువారి కూలి పని చేసే వారిగా వెళుతున్నామని తెలిపారు. ఎక్కువమంది తమ పిల్లల ను ప్రైవేటు స్కూళ్ల కాలేజీలలో చదివించుకుంటున్నామని వైద్యం విషయంలోనూ షుగర్ బిపిలు ఇతర రకాల వ్యాదులను నయం చేయించు కునేందుకు ప్రయివేటు హాస్పిటలలో చూపించుకుంటూ వైద్యానికి ఎక్కువ ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ సర్వేలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎస్ కే రెహానా బేగం, జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు అల్లాడి గోపాల్, అబ్దుల్ అజీజ్ కొండా ప్రసాద్, కే పెంచల నరసయ్య నాయకులు ఎంవి రమణ, మహిళా సంఘం నాయకురాలు షాహినాబేగం, ఆటో యూనియన్ నాయకులు కే సురేష్, ఎం సుధాకర్, గౌరీ ప్రసాద్ కే.కృష్ణమూర్తి, గుంటి నాగరాజు, శ్రీపతి వెంకయ్య, ఎస్కే రఫీ, తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరంలో..

ప్రజాశక్తి-అనంతసాగరం : అనంతసాగరం గ్రామపంచాయతీలోని మజార గ్రామమైన సంజీవ్ నగర్‌లో గ్రామీణ శ్రామిక సర్వే వ్యవసాయ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పాల్గొని మాట్లాడుతూ సంజీవ్ నగర్‌లోని ప్రతి కుటుంబాన్ని దర్శించి వాళ్ళ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది వ్యవసాయ కూలీలకు పోతున్నారని సర్వే చేశారు. గ్రామంలోని అరుంధతి, ఎస్టీ కాలనీ గ్రామంలోని అన్ని కుటుంబాలను సర్వే చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్ సాగరం సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ భాషా, గ్రామ సిపిఎం కార్యదర్శి జక్కరయ్య, నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై నిరసన

ప్రజాశక్తి-మర్రిపాడు



నిరసన చేపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట మండలంలోని వడ్డెపాలెం, తిమ్మాయపాలెం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య వెంగయ్య పాల్గొని మాట్లాడుతూ విలీనం పేరిట పాఠశాలల స్థాయిని తగ్గించరాదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 3నుండి 5వ తరగతి లోపు విద్యార్థులను గ్రామానికి దూరంగా 1, 2 కిలో మీటర్లు దూరం ఉండే పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. వ్యవసాయ కూలి పనులుకెళ్లేనే పూట గడవని వాళ్ళు ప్రతిరోజు తమ పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకురావడం వల్ల ఆ రోజు పనులకు వెళ్లలేక కుటుంబం పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. తిమ్మాయపాలెం గ్రామం నుండి వెళ్లాలంటే జాతీయ రహదారి దాటుకుని వెళ్ళాలని తెలిపారు. వెళ్లే సమయంలో విద్యార్థులకు ఏ క్షణంలో ఏం జరుతుందో నని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వడ్డెపాలెం నుండి భీమవరం వెళ్లాలంటే రహదారి వెంట పంట కాలువల్లో నడుము లోతు నీళ్ల ఉండడంతో ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేస్తే పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తమ బిడ్డలను చదువుకు దూరం చేయొద్దంటూ వేడుకున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం ఎంఇఒ-2 ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రహంతుల్లా, సిఐటియుఏ మండల కార్యదర్శి రత్నయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



6న భ.ని.కా. సంఘం మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం 32 డివిజన్ భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం డైకాస్ రోడ్డు సిపిఎం ఆఫీసులో జరిగింది. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మాట్లాడారు. జులై 6 తేదీ భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ మహాసభ మన్సూర్ భవన్‌లో జరుగుతుంది. కావున భవన నిర్మాణ కార్మికులు ఎక్కువమంది పాల్గొని జయ ప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఖలీల్, కొండా ప్రసాద్, సిఐటియు నాయకులు ఎం సుధాకర్ పిలుపుని చ్చారు. అనంతరం 13మందితో కమిటీ అధ్యక్షులు గా బాజావలీ, కార్యదర్శిగా ఖాదర్ ఎన్నుకున్నారు.

జిల్లాలో పలుచోట్ల 'యోగాంధ్ర'

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జిల్లాలో పలుచోట్ల యోగాంధ్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయి వేటు స్కూల్స్, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలో చేపట్టారు. నియోజకవర్గ ఎంఎల్ఎలు సైతం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కావలిలో ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి, వింజమూరులో ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్, కోవూరులోని బాలికల పాఠశాలలో ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయగిరి, కావలి, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో అధికారులు, విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వెంకటాచలం

జిల్లా ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలు జూలై 1 మంగళవారం బుచ్చిరెడ్డిపాలెం టౌన్‌లో జరగబోతున్నాయి. ఈ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ వెంకటాచలం మండలం, కాకుటూరు, గొలగమూడి ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా, సిఐటియు నాయకులు కృష్ణయ్య మాట్లాడుతూ వెంకటాచలం మండలం కాకుటూరు నుండి కంటి పల్లి గొలగమూడి వెళ్లే మార్గంలో రైల్వే గేట్ సుమారు రెండు నెలలుగా రిపేరు పనులు జరుగుతూ మూసివేశారన్నారు. అప్పటినుండి ఆటో కార్మికులు రైతుల ట్రాక్టర్లు, రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వేగేటుని మరలా ఓపెన్ చేయాలని కోరారు. నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమ అభివృద్ధి కోసం అహర్నిశలు అలుపెరగని పోరాటాలు చేసిన సంఘం నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం అని అన్నారు. కార్యక్రమంలో కాకుటూరు, గొలగమూడి ఆటోస్టాండ్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : జూలై ఒకటో తేదీన బుచ్చిరెడ్డిపాలెం టౌన్ లో జూలై1న జరిగే ఆటో యూనియన్ ఆరవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆటో స్టాండ్ అధ్యక్షులు ఆకురాతి వెంకయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆటో కార్మికులకు ఎటువంటి సంక్షేమాన్ని ఏర్పాటు చేయకుండా కార్మికులపై అధిక బారాలను మోపుతున్నారన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శాంతియుతంగా సర్వేయర్ల నిరసన

ప్రజాశక్తి-బిట్రగుంట

రాష్ట్రంలో ప్రస్తుతం గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న రేషనలైజేషన్ ప్రక్రియ, క్లస్టర్ విధానంలో మిగులు గ్రామ సర్వేయర్ల భవిష్యత్, జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో సొంత మండలం సమస్య, రీ సర్వే చేస్తున్న గ్రామ సర్వేయర్లకు టెక్నికల్ పేస్కేల్, ప్రమోషన్ ఛానెల్ వంటి సమస్యలకు ప్రభుత్వం సరైన మార్గదర్శకాలు తెలిపేంతవరకు పెన్‌డౌన్ ద్వారా శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎపి గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆదేశాలు మేరకు శనివారం జిల్లాలోని అన్నీ మండలాల్లో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు కు,మండల సర్వేయర్లకు రెప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో భాగంగా డిప్యూటీ తహశీల్దార్ కె భరత్ కుమార్‌కు, మండల సర్వేయర్ కె.వెంకటేశ్వర్లు, ఎపి గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మానంద రెప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు కె.అశోక్ కుమార్, ఎస్.శివ, పి.వినయ్ కుమార్, ఆర్.రాజశేఖర్, డి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : తహశీల్దార్ కార్యాల యం వద్ద బదిలీల్లో జిఒ నెంబర్ 05ను రద్దు చేయాలని కోరుతూ మండల సచివాలయ సర్వేయర్లు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సోమ్లా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు

ప్రజాశక్తి-నెల్లూరు

వీక్షణం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలోని అనుమసముద్రం రహదారి వద్ద వరసగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాలల్లో కూలీలు మృత్యువాత పడటంతో కుటుంబంలోని పెద్ద దిక్కును కల్పోవడం శోచనీయం. అదేవిధంగా క్షణికమైన ఆవేశానికి గురికావడం, యువత మద్యం మత్తులో చిన్నపాటి ఘర్షణలకు దిగడం హత్యలకు పాల్పడటం వంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. జిల్లాలో నేరాలు.. ఘోరాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. మెడికల్ కళాశాలలు ప్రయివేటీకరణ చేయడం వల్ల కలిగే అనర్థాలు, సామాన్య మధ్య తరగతి ప్రజలకు అవసరమైన సమయంలో వైద్యసేవలు అందుకోవడం కష్టతరమవుతాయంటూ ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన సదస్సుకు విశేష స్పందన కనిపించింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్పేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో, అడ్మిషన్లు తీసుకొనే నేపథ్యంలో ఫీజుల రూపంలో పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు నగదు చెల్లించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. తమ పిల్లలను పాఠశాలల్లో చేర్చడమే కాకుండా వారికి పుస్తకాలు, యూనిఫారం, షూస్ తదితర వస్తువులు ఆయా పాఠశాలల యాజమాన్యాల వద్దనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వాతావరణంలో అనూహ్యమైన మార్పులు ఏర్పడుతున్న నేపథ్యంలో నిమిషాల వ్యవధిలో వర్షం పడటం, సూర్యుడు తన ఉగ్రరూపం చూపించడం వంటివి చోటు చేసుకోవడం కారణంగా ప్రజలు విలవిలలాడుతున్నారు.